క్లుప్తంగా

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న పాస్టర్లు

రాయదుర్గంటౌన్: ప్రముఖ క్రైస్తవ సువార్తీకుడు ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని రాయదుర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్అండ్బీ అతిథి గృహం వద్ద నుంచి పాస్టర్లు ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ నాగరాజు, పోలీసులకు వినతిపత్రం అందించారు. పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇషాక్ శామ్యుల్, ఉపాధ్యక్షుడు కిరణ్కుమార్, ప్రధాన కార్యదర్శి జయ చంద్రబాబు మాట్లాడారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆనంద్, ప్రేమ్కుమార్, శామ్యుల్, జాన్సన్, ప్రభుదాస్, డేవిడ్, సరలమ్మ, జాన్ విక్టర్ పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పరిశీలన


అంగవైకల్యం, బుద్ధిమాంద్యత శాతాన్ని పరీక్షిస్తున్న వైద్యుడు

రాయదుర్గంటౌన్: సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలనలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆర్థో స్పెషలిస్టు ఆధ్వర్యంలో పరిశీలన జరిగింది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు క్యాంపునకు వచ్చారు. సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు వైకల్యం ఉన్న వారిని మరోసారి వైద్యుడు పరిశీలించారు. నెలలో రెండు క్యాంపుల చొప్పున ఆరు రోజుల పాటు పునఃపరిశీలన కార్యక్రమం జరుగుతోంది. ఒక రోజుకు 50 సదరం సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నారు.

రైతులు నేరుగా అమ్ముకుంటేనే ఆదాయం

కూడేరు: రైతులంతా రైతు ఉత్పత్తిదారుల సంఘంగా తయారై పంట దిగుబడులు నేరుగా అమ్ముకుంటేనే ఆదాయం వస్తుందని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్మెంట్ (ఐఐపీఎం) ప్రతినిధులు డాక్టర్ నబీ రసూల్, డాక్టర్ నరేంద్రన్ తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాయంలో ఏఓ విజయ కుమార్ అధ్యక్షతన రైతులు ఆర్థికంగా ఏవిధంగా బలోపేతం కావాలి అన్న అంశంపై ఐఐపీఎం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ విజయ కుమార్, ఏఈఓ శైలజ, కార్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నిర్మలా రెడ్డి , రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం, నాటుసారా ధ్వంసం


మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న దృశ్యం

కంబదూరు: స్థానిక చెరువు కట్ట వద్ద కర్ణాటక మద్యం, నాటుసారాను ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. కంబదూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో 79 కేసులలో పట్టుబడిన కర్ణాటక మద్యం, నాటుసారాను ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్రెడ్డి, డీటీఎఫ్ జయనాథ్రెడ్డి, సీఐ సునీల్కుమార్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. మద్యం విలువ సుమారు రూ.1.93 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ ఆడితే చర్యలు


మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ, ఎస్ఐ

కణేకల్లు: క్రికెట్ బెట్టింగ్లకు పాల్పడితే చర్యలు తప్పవని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ నాగమధు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. మెయిన్రోడ్లలో సెల్ఫోన్లు, టీవీల్లో క్రికెట్ మ్యాచ్ చూస్తూ అరుపులు, కేకలు వేయడం, గుంపులుగా ఉండడం లాంటివి చేసినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్తో ఎంతో మంది జీవితాలు తలకిందులయ్యాయన్నారు. గ్రామాల్లోనూ, పట్టణాల్లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతుంటే 100 లేదా 112 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

యాటకల్లులో గడ్డివామి దగ్ధం

శెట్టూరు: మండలంలోని యాటకల్లులో గొల్ల ఈరన్న గడ్డివామికి శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. రెండు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు, రెండు ట్రాక్టర్ల వరి గడ్డి కాలిపోయినట్లు రైతు తెలిపారు.

అంతా గత వైభవమే!


కేవలం 20 శాతం మేర ఆగిన పనులతో ప్రారంభానికి నోచుకోని వంద పడకల ఏరియా ఆస్పత్రి

- ప్రభుత్వ భవన నిర్మాణాలకు కూటమి గ్రహణం
- పది నెలలుగా అభివృద్ధికి ఒక్క అడుగూ పడని వైనం
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎక్కడి పనులు అక్కడే

ప్రస్తుతం పైసా మంజూరు కాని పరిస్థితి..

రాయదుర్గం పురపాలక సంఘంలో గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు కళ్లముందు కనిపిస్తోంది. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులతో పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారిపోయాయి. మెరుగైన సౌకర్యాలు కల్పించారు. ఇదే క్రమంలో ఒక వైపు సంక్షేమంతో పాటు స్కీమ్ నిధులు, సీఎండీఎఫ్, గడప గడపకూ మన ప్రభుత్వం పథకం కింద రూ.కోట్లతో అవసరమైన చోట్ల రోడ్లు, కాలువలు, తాగునీటి పైప్లైన్లు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి పది నెలలు గడిచిపోతున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మచ్చుకైనా అభివృద్ధి కనిపించడం లేదు. ప్రత్యేక నిధుల మంజూరు దేవుడెరుగు అసలు స్కీమ్ నిధులు కూడా పైసా మంజూరు కాని పరిస్థితి ఉంది. ప్రతి పనికీ సాధారణ నిధులు వెచ్చించలేక మున్సిపల్ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.

రాయదుర్గంటౌన్: అభివృద్ధి, సంక్షేమం.. విద్య, వైద్యం, వ్యవసాయం..మహిళా సాధికారత, పార్టీల కతీతంగా పథకాలు.. ఇలా ఏ రంగమైనా.. అంతా గత వైభవమే. వైఎస్ జగన్మోహన్రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో అన్ని వర్గాలకూ పారదర్శక పాలన అందించారు. ప్రతి గడపకూ ఫలాలు అందించారు. ప్రతి పల్లెలోనూ ప్రగతి పురోగతి కనిపించింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కనుచూపు మేరలో అభివృద్ధి, సంక్షేమం కనిపించడంలేదు. నిధుల లేమితో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీనికితోడు అధికారులు పట్టించుకోవడంలేదు..ప్రజాప్రతినిధులు అభివృద్ధి మాట విస్మరించారు.

ఆగిపోయిన అభివృద్ధి పనులు :

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు ముందుకు సాగలేదు. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించి చేపట్టిన భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. రాయదుర్గంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని రూ.17 కోట్లతో నిర్మించారు. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. భవనం అందుబాటులోకి తెచ్చే నాటికి ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. కణేకల్లు రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం కూడా అర్ధంతరంగా నిలిచిపోయాయి. గదులు సర్దుబాటు చేసుకుని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోనే బాలికల జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారు. కిక్కిరిసిన విద్యార్థులతో బాలికల చదువులు ముందుకు సాగడం లేదు. భవన నిర్మాణాన్ని పూర్తి చేసే విషయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ పనులు కూడా నిలిచిపోయాయి. మరోవైపు నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు


రాయదుర్గం: ఖుబా మసీదు వద్ద నిర్మించిన రోడ్డు

మారాయి. శతాబ్దాలుగా కనీస సౌకర్యాలు లేక తల్లడిల్లిన ప్రభుత్వ పాఠశాలలకు వైఎస్ జగన్ జీవం పోశారు. చదువుతోనే విద్యార్థుల తలరాత మారుతుందనే గొప్ప సంకల్పంతో రూ.కోట్లుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్కు ధీటుగా తీర్చిదిద్దారు. రెండో విడత నాడు–నేడు కింద చేపట్టిన తరగతి అదనపు భవనాలు మొండిగోడలకే పరిమితమయ్యాయి. వీటన్నింటికి కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అర్ధంతరంగా ఆగిపోయాయి. పనులు పూర్తి చేసి వీటిని అందుబాటులోకి తేవాలనే ఆలోచన కూడా కూటమి ప్రభుత్వంలో లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.


ఆగిన అభివృద్ధి పనులు

వైఎస్సార్సీపీ హయాంలో అభివృద్ధి పరుగులు..

వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రాయదుర్గంలోని 18 సచివాలయాల పరిధిలో డీబీటీ ద్వారా రూ.225 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.144 కోట్లతో అభివృద్ధి పరుగులు పెట్టింది. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, నీటి వసతి కోసం బోర్లు, సిస్టన్ ట్యాంకుల ఏర్పాటు, ఆస్పత్రుల నిర్మాణంతోపాటు ఇతర అభివృద్ధి పనులు విరివిగా చేపట్టారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని గాలి కొదిలేసింది. పైగా గతంలో మున్సిపాలిటీలో వర్క్ ఆర్డర్లు ఇచ్చి ప్రారంభంకానివి, 25 శాతం లోపు జరిగిన దాదాపు 37 అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం అర్ధంతరంగా రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది.

నిధులు కేటాయించాలి



ఎంతో ఉన్నతాశయంతో అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్కు ధీటుగా రూపురేఖలు మార్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాఠశాల విద్య , అభివృద్ధిని పట్టించుకోలేదు. నాడు–నేడు కింద అదనపు గదులు అర్ధంతరంగా ఆగిపోయాయి. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల భవనాన్ని పూర్తి చేయాలి. – **కేడిమి ప్రశాంత్, వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, రాయదుర్గం**

ఆస్పత్రిని అందుబాటులోకి తేవాలి



రాయదుర్గంలో వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలి. భవన నిర్మాణం నిలిచిపోయింది. రోజుకు వందలాది మంది వైద్యం కోసం ఏరియా ఆస్పత్రికి వస్తున్నారు. ప్రస్తుతం సిబ్బంది, వైద్యులు, పడకల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలి. వైద్యుల పోస్టులు కూడా మంజూరవుతాయి.
– **మల్లికార్జున, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, రాయదుర్గం**

నిధులు మంజూరయితే పనులు పూర్తి చేయిస్తాం



పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఎన్ని పాఠశాలల్లో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి..ఏ దశలో ఉన్నాయనే విషయాలు, వాటి పురోగతిపై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయిన వెంటనే నిర్మాణాలు పూర్తి చేయించి అందుబాటులోకి తెస్తాం.
– **నాగమణి, ఎంఈఓ, రాయదుర్గం**

అనుకున్నదొక్కటి...అయ్యిందొక్కటి...!

- అంతర్మథనంలో అధికార పార్టీ సీనియర్ నేతలు
- మార్కెట్ యార్డు పదవి రాకపోవడంతో మండిపాటు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో టీడీపీ నాయకులు అనుకున్నదొక్కటయితే.. మరొకటి అయ్యింది. స్థానిక మార్కెట్ యార్డు పదవి ఆశించిన వారికి ఆశాభంగమే అయ్యింది. ఈనెల 28న ప్రభుత్వం మార్కెట్ కమిటీ చైర్మన్ల ఎంపిక జాబితా విడుదల చేసింది. దీంతో తమనే చైర్మన్ పదవి వరిస్తుందని ఆశించిన పలువురు టీడీపీ సీనియర్ నేతలు.. చివరికి భంగపడ్డారు.

అంతర్మథనంలో సీనియర్ నేతలు...

టీడీపీ అధిష్టానం కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు చైర్పర్సన్గా దివంగత నేత, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గొల్ల బాదెన్న కోడలు బోయ లక్ష్మీదేవిని నియమించింది. ఇది మింగుడు పడని టీడీపీ నేతలు.. తమ భవిష్యత్ ఏంటని అంతర్మథనంలో పడ్డారు. పదవి ఆశించిన వారు భంగపాటుకు గురయ్యారు. ఇందులో గొల్ల గ్రామానికి చెందిన ప్రస్తుత టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశులు తనకే మార్కెట్ యార్డు చైర్మన్ పదవి వస్తుందని ఆశపడ్డాడు. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వద్ద కూడా ఆశించినట్లు సమాచారం. అతనితో పాటు బ్రహ్మసముద్రం మండల సీనియర్ నాయకుడు నాగిరెడ్డిపల్లి వెంకటేశులు, కుందుర్పి మండల ప్రస్తుత టీడీపీ కన్వీనర్ ధనుంజయ, శెట్టూరు మండలం మంగంపల్లికి చెందిన టీడీపీ నేత కుబేర్ యాదవ్ మార్కెట్ యార్డు చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. పార్టీ అధిష్టానం గొల్ల బాదెన్న కుమారుడు రమేష్ భార్య బోయ లక్ష్మీదేవిని ఎంపిక చేయడంతో ఆశావహులందరూ నిరాశకు గురయ్యారు.


కళ్యాణదుర్గం టీడీపీ కార్యాలయం

భవిష్యత్పై సమాలోచనలు..

మార్కెట్ యార్డు పదవి తమకే వస్తుందని ఆశించిన పార్టీ నేతలు.. చివరకు పదవి దక్కకపోవడంతో భవిష్యత్పై సమాలోచనల్లో పడ్డారు. పార్టీ తమ సీనియార్టీని కూడా గుర్తించలేదని పార్టీ సన్నిహితులతో అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సీనియర్లకు పదవి కట్టబెడితే ఎమ్మెల్యేపై తిరుగుబావుటా ఎగురవేస్తారన్న ఉద్దేశంతోనే తమకు పదవులు ఇవ్వడం లేదనే అనుమానం పార్టీ సీనియర్లలో వ్యక్తమవుతోంది.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని ధర్నా

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీపీఎం, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని కోరుతూ ధర్నా చేపట్టారు. ఈధర్నాను ఉద్దేశించి సీపీఎం నాయకులు రంగారెడ్డి, మధు మాట్లాడుతూ అధికారంలోకొచ్చిన తొమ్మిది నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపినట్లు తెలిపారు. ప్రతి యూనిట్కు నెలకు రూ.1.46 నుంచి రూ.1.65 అదనంగా చెల్లించాల్సి వస్తోందన్నారు. 2024–25 సంవత్సరానికి రెండో సారి సర్దుబాటు చార్జీల భారం వేయడానికి కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందించారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: ఇంధన సర్దుబాటు, ట్రూ అఫ్ చార్జీలను రద్దు చేయాలని స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భాస్కర్కు విద్యుత్ సమస్యలపై వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో పేద, మధ్య తరగతి కుటుంబాలపై భారం వేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని చెప్పి, అధికారంలోకొచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరలు భారీగా పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రంగనాథ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు సోము పాల్గొన్నారు.


ఉరవకొండ: వినతి పత్రం అందిస్తున్న నాయకులు

వేలం ద్వారా రూ.1.27 లక్షల ఆదాయం

కంబదూరు : కంబదూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కర్ణాటక మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్రెడ్డి, డీటీఎఫ్ జయనాథ్రెడ్డి, సీఐ సునీల్కుమార్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. 15 వాహనాలు వేలం వేయగా రూ.1,27,204 లక్షలు ఆదాయం వచ్చినట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

మార్కెట్ యార్డు చైర్పర్సన్గా బోయ లక్ష్మి

కళ్యాణదుర్గం: దుర్గం మార్కెట్ యార్డు చైర్ పర్సన్గా గొల్లకు చెందిన బోయ లక్ష్మీదేవిని నియమిస్తూ ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్ల బాదెన్న కోడలు లక్ష్మీదేవికి చైర్పర్సన్ పదవి కట్టబెట్టారు. మార్కెట్ యార్డు చైర్మన్ తిమ్మరాజమ్మ స్థానంలో బోయ లక్ష్మీదేవిని ఎంపిక చేసినట్లు సమాచారం.

ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తే చర్యలు

కళ్యాణదుర్గం: పట్టణంలో ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ యువరాజ్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక టీ సర్కిల్ నుంచి గాంధీ చౌక్ వరకు ట్రాఫిక్ అంతరాయంపై పట్టణ సీఐ యువరాజ్, మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్ పరిశీలించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీ రసూల్ సూచించారు. శుక్రవారం కల్లుదేవనహళ్లి ఆర్డీటీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకొని చట్టాలపై అవగాహన కల్పించారు. ఈఓ పీఆర్డీ దాస్, వీఆర్వో శృతి పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

కుందుర్పి: పౌష్టికాహారం పంపిణీలో పారదర్శకత పాటించి గర్భిణులు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ రాధ పేర్కొన్నారు. శుక్రవారం కుందుర్పిలో శెట్టూరు, కుందుర్పి మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలకు పౌష్టికాహారం పంపిణీ, పోషణ్బీ తదితర కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ తిప్పేస్వామి, సూపర్వైజర్లు లక్ష్మీదేవి, సుశీల,కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

కుందుర్పి: కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో నుంచి కర్ణాటక సరిహద్దు పట్టణాలకు వెళ్లే అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని పలువురు కుందుర్పి వాసులు జిల్లా కేంద్రంలో ఆర్టీసీ అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందించారు. పదేళ్లుగా కళ్యాణదుర్గం వయా కుందుర్పి మీదుగా బెంగళూరు, చెళ్లకెరకు బస్సులు నడిపేవారన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించండి


విడపనకల్లు: వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తున్న వైద్య సిబ్బంది

విడపనకల్లు: వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి అన్నారు. శుక్రవారం విడపనకల్లులో పీహెచ్సీలో వైద్య ఆరోగ్య శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పుష్ప, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ ప్రాణాంతకం

బొమ్మనహాళ్: వడదెబ్బను నిర్లక్ష్యం చేస్తే ప్రాణపాయ పరిస్థితులు తలెత్త వచ్చని శ్రీధరఘట్ట పీహెచ్సీ వైద్యాధికారి కుమారరాజా హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని శ్రీధరఘట్ట పీహెచ్సీ పరిధిలోని సింగానహళ్లి లో వడదెబ్బ, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, హెల్త్ ఆఫీసర్ శివప్రసాద్,సూపర్వైజర్ ఉమాదేవి, సిబ్బంది అలివేలు, ఈశ్వరమ్మ, శంకుతల పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

కూడేరు: వేసవి కాలంలో జాగ్రతలు పాటిస్తే వడదెబ్బ బారిన పడకుండా రక్షణ పొందొచ్చని మండల వైద్యాధికారి సౌమ్యా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్సీలో గర్భిణులకు వడదెబ్బపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. సూపర్ వైజర్లు యశోద, రవీంద్ర, ఎంఎల్హెచ్పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి

ఉరవకొండ: గ్రామస్థాయిలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తామని వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏసీ ఎర్రిస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందా చంద్రమ్మ పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ అనుబంధ కమిటీల్లో ఉరవకొండకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. శుక్రవారం ఏసీ ఎర్రిస్వామి, చందా చంద్రమ్మ మాట్లాడుతూ తమను అనుబంధ సంఘాల రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డికు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్సీ,ఎస్టీలకు భూపంపిణీ చేయాలి

వజ్రకరూరు: భూమిలేని ఎస్సీ,ఎస్టీలకు ప్రభుత్వం భూపంపిణీ చేయాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. శుక్రవారం వజ్రకరూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎస్సీ,ఎస్టీలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పరచాలని, లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. దళిత సంఘం సీనియర్ నాయకులు బెంజిమెన్, ఏసన్న, జేఏసీ నాయకులు చాబాల సురేష్, గుడిసి రవీంద్ర, సుధాకర్, దావీదు, సుంకన్న, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, చంద్ర, రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణం సమీపంలోని అక్కమ్మగార్ల ఆలయ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటంపల్లికి చెందిన శ్రీరాములు గాయపడ్డాడు. అతన్ని మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

పది పరీక్ష కేంద్రాల పరిశీలన


కళ్యాణదుర్గంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: పట్టణంలోని స్థానిక జ్ఞానభారతి ప్రైవేట్ పాఠశాలలో జరుగుతున్న పది పబ్లిక్ పరీక్షలను ఆర్డీఓ వసంతబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల హాజరు, గైర్హాజరుపై చీఫ్ ఎగ్జామినర్ను అడిగి తెలుసుకున్నారు.

ఐదుగురు విద్యార్థుల గైర్హాజరు

కూడేరు: స్థానిక జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలో ముగ్గురు, కేజీబీవీలో ఇద్దరు చొప్పున విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ మహమ్మద్ గౌస్ తెలిపారు. శుక్రవారం పదో తరగతి జీవశాస్త్రం పరీక్ష జరిగింది. మొత్తం 306 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరయ్యారు.

జైభీమ్ సేన ర్యాలీ జయప్రదం చేయండి


జైభీమ్ సేన ర్యాలీ కరపత్రాలను విడుదల చేస్తున్న తహసీల్దార్ భాస్కర్, వీకేసీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ర్యాలీ ఉంటుందని వీకేసీ రాష్ట్ర కార్యదర్శి మందల రమేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జైభీమ్ సేన ర్యాలీ కరపత్రాలను రెవెన్యూ అధికారులు విడుదల చేశారు. వీకేసీ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున అన్ని వర్గాల వారు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చాపిరి నాగరాజు, మహా లింగ, బొమ్మన్న, బెరిలా రవి, శివరాజ్, తిమ్మరాజు, తిప్పయ్య, జగదీష్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎస్వీజీఎం కళాశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థులు

కళ్యాణదుర్గం: పట్టణంలోని స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల వార్షికోత్సవం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ముందుగా విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల ఆవరణలోని సరస్వతి విగ్రహానికి పూలమాలలు వేసి, పూజలు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను అధిగమించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఉన్నత స్థాయికి ఎదిగేందుకు పట్టుదల, కృషితో చదవాలన్నారు. కష్టపడి కళాశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంవీ శేషయ్య, అధ్యాపకులు టి.శైలజ రాణి, సూర్యనాగిరెడ్డి, శ్రీధర్, జోత్స్న, కవిత, చాముండేశ్వరి, శ్యాం ప్రసాద్, రవిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన


కంబదూరులో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలోని సయ్యదన ఉమర్ మసీదు వద్ద వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింలు చేతులకు నల్లబ్యాండ్లు కట్టుకొని శుక్రవారం నిరసన తెలియజేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్బీ) ఇచ్చిన పిలుపు మేరకు రంజాన్ చివరి శుక్రవారం అల్విదా జుమా సందర్భంగా నిరసన తెలపాలనే పిలుపు మేరకు నిరసన తెలిపినట్లు తెలిపారు.

నల్ల బ్యాడ్జీలతో ముస్లింల నిరసన

కంబదూరు: మండల కేంద్రంలోని జామియా మసీదులో పార్లమెంటులో వక్ఫ్బోర్డు సవరణ బిల్లు ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ శుక్రవారం ముస్లింలు నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఈ బిల్లు ప్రవేశపెడితే ముస్లింలు ఎంతో నష్టపోతారని తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్: కల్లుదేవనహళ్లి గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13,400 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

పండుగ పూట పస్తులేనా?

రాయదుర్గంటౌన్: రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలో ప్రభుత్వ తీరుపై పేదలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెల్లరేషన్ కార్డుదారులకు చౌకధాన్యపు డిపోల్లో పూర్తి స్థాయిలో రేషన్ సరుకులు అందలేదు. బియ్యం, చెక్కర, అప్పుడప్పుడు జొన్నలు మాత్రమే పంపిణీ చేస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటున్నట్లు పేదలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా ఒకటిరెండు నెలలు మాత్రమే కందిపప్పు పంపిణీ చేశారు. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.120 పలుకుతోంది. కార్డుదారులకు రాయితీపై కిలో రూ.67లకు అందిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం ఐదారు నెలల నుంచి కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. ఉగాదితోపాటు రంజాన్ పండుగ కూడా సమీపించింది. మార్చి మాసంలో కందిపప్పు సరఫరా కాలేదు. వైఎస్సార్సీపీ హయాంలో బియ్యం , చక్కెర, గోధుమ పిండి, జొన్నలు, రాగులు పంపిణీ చేసిన విషయాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

మండుతున్న నిత్యావసర ధరలు..

ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు మండుతున్నాయి. ఉగాది, రంజాన్లకు ప్రతి ఒక్కరూ పిండి వంటలు చేసుకోవడం ఆనాయితీ. ఈ నేపథ్యంలో మార్కెట్లో శనగ, కందిపప్పు, బెల్లం, నూనె ధరలు అమాంతం పెరిగాయి. ధరల పెరుగుదలతో పండుగ వంటల్లో రుచి తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.